


రోగుల నిలువు దోపిడీ

స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్ల దందా

- వైద్య పరీక్షల పేరిట ఇష్టారాజ్యం
- టెస్టులకు వాళ్లు పెట్టిందే రేటు
- గుట్టుగా సాగుతున్న లింగ నిర్ధారణ, అబార్షన్లు
- జాడలేని టాస్క్‌ఫోర్స్
- మామూళ్ల మత్తులో వైద్య, ఆరోగ్యశాఖ

వరంగల్ మెడికల్, మే 30 : వైద్య పరీక్షల పేరిట ప్రైవేట్ డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ప్రజలను దోచుకుంటున్నారు. వారు చెప్పిందే రేటు అన్నట్టుగా చెల్లించాల్సి వస్తుండటంతో జనం విలవిల్లాడుతున్నారు. వైద్యుడి మాటను కాదని.. మరో చోట పరీక్షలు చేయించుకునే ధైర్యం లేక ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు పెట్టిన ఫీజును చెల్లించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనంతటికీ వైద్యులు, సెంటర్ల నిర్వాహకుల మధ్య జరిగే కమీషన్ల వ్యవహారమే కారణమన్నది జగమెరిగిన సత్యం. ముఖ్యంగా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో జరుగుతున్న డయాగ్నస్టిక్, స్కానింగ్ కేంద్రాల దోపిడీపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

పుట్టుకొస్తున్న డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లు

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరంలోనే లెక్కలేనన్ని డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లు పుట్టుకొచ్చాయి. ఇవన్నీ ప్రస్తుతం రోగులను పీల్చిపిప్పి చేసే కేంద్రాలుగా మారాయి. తమ లాభాలతోపాటు దళారులకు, రిఫరల్ వైద్యులకు ఇవ్వాల్సిన కమీషన్లను కూడా రోగి నుంచి వసూలు చేస్తున్నారు. దళారీ వ్యవస్థను పెంచి పోషిస్తూ రోగులకు అవసరం లేకపోయినా ఎంఆర్ఐ, సిటీ స్కాన్, ఈఈజీ లాంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోగుల నుంచి వీరు వసూలు చేసే సొమ్ములో 50శాతం కమీషన్లు దళారులకు, రిఫరల్ వైద్యులకు చెల్లిస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే ఈ కేంద్రాల్లో పరీక్షల నాణ్యతా ప్రమాణాలు కూడా అంతంత మాత్రమే ఉంటున్నాయని రోగులు వాపోతున్నారు. గుర్తింపు పొందిన సెంటర్లతోపాటు గుర్తింపు లేని సెంటర్లు కూడా వైద్య పరీక్షలు చేస్తున్నా వైద్యఆరోగ్య శాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టాస్క్‌ఫోర్స్ ఎక్కడ?

గుర్తింపులేని సంస్థలతోపాటు అధిక ధరలు వసూలు చేస్తున్న స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్లను గుర్తించేందుకు నియమించిన టాస్క్‌ఫోర్స్ ఎక్కడా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. నగరంలో విచ్చలవిడిగా దోపిడీ జరుగుతున్నా మౌనంగా ఉండటం వెనుక మర్మమేమిటన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సామాన్యుల పక్షాన నిలబడాల్సిన టాస్క్‌ఫోర్స్ దళారులకు అండగా ఉంటుందని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు

పలు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి లింగ యథేచ్ఛగా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం కఠిన నిబంధనలు రూపొందించినా లింగ నిర్ధారణ పరీక్షలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, పరీక్షలు చేయించుకుంటున్న వారిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటున్నారని సమాచారం. ఈ పరీక్షలు చేసేందుకు ఆర్ఎంపీ లు, పీఎంపీలు సహకరిస్తున్నారని.. ఒక్కో లింగ నిర్ధారణ పరీక్షకు రూ. 15వేల చొప్పున వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన అనంతరం అవసరమైతే అబార్షన్లు కూడా చేస్తున్నారని సమాచారం. నగరంలోని కాకాజీ కాలనీ, రాంనగర్, డబ్బాల జంక్షన్, కాశీబుగ్గ, బాలసముద్రం, కాజీపేటలో పలు డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లలో ఈ తతంగం నిత్య కృత్యంగా మారింది. గతంలోనే పలుసందర్భాల్లో వెలుగులోకి వచ్చినా.. మళ్లీ కొత్త సెంటర్లు పుట్టుకొస్తుండటంతో ఈ దందా యథేచ్ఛగా సాగుతున్నట్టు చర్చ జరుగుతోంది.

మామూళ్ల మత్తులో ఆరోగ్యశాఖ

ప్రైవేట్ డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్ల పనితీరుపై నిరంతరం నిఘా పెట్టాల్సిన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని, ఆయా సెంటర్ల నిర్వాహకులు ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి కళ్లు మూసుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లపై నాణ్యత ధరల విషయంలో నిరంతరం తనిఖీలు చేయకుండా మౌనంగా ఉండటం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అబార్షన్లు చేస్తున్నారని వచ్చిన సమాచారంతో పలు సెంటర్లపై దాడులు చేసిన అధికారులు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని, చట్టాలను పకడ్బందీగా అమలు చేసి నిబంధనలను తుంగలో తొక్కుతున్న ఆయా సెంటర్ల నిర్వాహకులపై నిఘా పెట్టి.. పటిష్ఠ చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పట్టుబడినా శిక్షలు లేవు..

గతేడాది మార్చి 23వ తేదీన వరంగల్ దేశాయిపేట ఎంహెచ్ నగర్‌లో మొబైల్ స్కానింగ్ మిషన్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అలాగే ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించి.. ఓ వైద్యురాలు, నర్సుపై కేసులు నమోదు చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆ తర్వాత చేతులు దులుపుకున్నారు. ఇదే తరహాలో హనుమకొండ కాకాజీకాలనీ ప్రాంతంలో కూడా లింగ నిర్ధారణ కోసం స్కానింగ్‌లు నిర్వహిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు కేసులు నమోదు చేశారు. కానీ ఇలా పట్టుబడుతున్న వారికి శిక్షలు పడకపోతుండటంతో.. ఆయా ఘటనల్లో దొరికిన వారు తిరిగి ఇదే దందాను మరోచోట నిర్వహిస్తున్నట్టు వైద్య, ఆరోగ్యశాఖ తనిఖీల్లో వెల్లడవుతోంది. ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఈ దోపిడీకి అంతం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఎంజీఎంలో నిఘా లోపం

పెరిగిన నేరాలు .. పట్టించుకోని అధికారులు

సూపరింటెండెంట్‌కు పోలీసులు లేఖ

మట్టెవాడ, మే 31: నిఘా లోపంతో సామాన్యులకు రక్షణ లేకుండా పోతోంది. వరంగల్ జిల్లాలోని ఎంజీఎం ఆస్పత్రి ఉత్తర తెలంగాణలోనే అతి పెద్ద ఆస్పత్రి. ఈ ఆస్పత్రి నేరాలకు అడ్డాగా మారింది. ఇటీవల కాలంలో ఎంజీఎంలో తరచూ రోగుల కుటుంబ సభ్యులు, బంధువుల డబ్బులు, బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్నారు. ఆస్పత్రిలో నిఘా వ్యవస్థ, సీసీ కెమెరాలు లేకపోవడంతో సెక్యూరిటీ గార్డుల నిర్లక్ష్యంతో తరచూ నేరాలు జరుగుతున్నాయి. ఉత్తర తెలంగాణ పెద్ద ఆస్పత్రి అయిన ఎంజీఎంకు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వైద్యం కోసం వేలాది మంది వస్తుంటారు. వైద్యం కోసం వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులు బంధువులకు ఎంజీఎంలో రక్షణ లేకుండా పోయింది. కొన్ని నెలలుగా ఎంజీఎంలో యథేచ్ఛగా దొంగతనాలు వెలుగు చూస్తుండటంతో రోగులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. వైద్యం కోసం వస్తే డబ్బులు, బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు అపహరిస్తున్నారని వాపోతున్నారు. అలాగే పిల్లల కిడ్నాప్, విక్రయాలు జరుగుతున్నాయి. వైద్యం కోసం వచ్చే రోగులను, వారి కుటుంబ సభ్యులను కొంతమంది ఆకతాయిలు వేధిస్తున్నారు. ఎంజీఎంలో పోలీసు పికెటింగ్, ప్రైవేటు సెక్యూరిటీ గార్డులున్నా నేరాలు ఆగడం లేదు. నిఘా లోపంతో రోజురోజుకూ నేరాలు పెరుగుతున్నాయి. ఎంజీఎం అధికారుల నిర్లక్ష్యం దొంగతనాలు జరుగుతున్నాయని రోగులు వాపోతున్నారు.

సూపరింటెండెంట్‌కు లేఖ

సెక్యూరిటీ గార్డులు, సిబ్బంది నిరక్ష్యంతో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయని పోలీసులు ధ్రువీకరించారు. ఆస్పత్రిలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఏదైనా నేరం జరిగినప్పుడు నేరస్థులను పట్టుకోవడానికి తీవ్రంగా శ్రమించాల్సి వస్తుందని పోలీసులంటున్నారు. గురువారం మట్టెవాడ పోలీసులు ఎంజీఎంకు వచ్చే రోగులు రక్షణ, భద్రత కోసం 140 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు.

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు..

- ఏప్రిల్‌లో వరంగల్ లేబర్‌కాలనీకి చెందిన వ్యక్తి ఎంజీఎంలో గేటు ముందు ఆటోను పార్కు చేసి, లోపలికి వెళ్లాడు. గంట తర్వాత బయటకు వచ్చే సరికి ఆటో చోరీకి గురైంది.
- ఏప్రిల్ 9న ఎల్కతుర్తి మండలానికి చెందిన ఓ వ్యవసాయ దారుడు అతని బంధువులు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరడంతో పార్కింగ్‌లో ద్విచక్ర వాహనాన్ని పెట్టి లోనికి వెళ్లి వచ్చే సరికి ద్విచక్ర వాహనం చోరీకి గురైంది.
- జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో పేషంట్ల వద్ద ఉండే అమాయక మహిళలను టార్గెట్ చేసుకొని లోన్ల ద్వారా డబ్బులు ఇప్పిస్తామని, మీ సేవలో దరఖాస్తు చేయుటకు ఫొటో దిగాలని ఒంటి మీద బంగారు నగలు ఉంటే లోన్లు, ఇన్సూరెన్స్‌లు మంజూరి కావని వాటిని తీసుకొని ఒక మహిళ 70 గ్రాముల బంగారాన్ని దోచుకెళ్లింది. అదే విధంగా రూ.80 వేల నగదును దోచుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది.
- మార్చిలో ఎంజీఎంకు చికిత్స కోసం వచ్చిన మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వ్యక్తిపై మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.
- ఎంజీఎం సెంటర్‌లోని ఏటీఎంలో మార్చి 10న గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంను ట్యాంపరింగ్ చేసి రూ. 1 వేల నగదును డ్రా చేశాడు. రూ.90వేల మిషన్‌ను ధ్వంసం చేశారు.
- మే 28న మహిళా మెడలో నుంచి గుర్తు తెలియని మరో మహిళా బంగారు పుస్తెలు తాడును దొంగిలించింది. వార్డులోకి వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని మహిళ భారతి రెండు చేతులను బిగించి దాడి చేసి నాలుగు తులాల బంగారు పుస్తెలు తాడును అపహరించింది.

కౌంటింగ్ సరళిపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని

వరంగల్ కార్పొరేషన్, మే 31: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ సరళిపై సిబ్బందికి అవగాహన కలిగి ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పలు సూచనలు చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి సంబంధించి 230 పోలింగ్ కేంద్రాలకు గాను 14 టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. 16 రౌండ్లలో ఒక్కో టేబుల్ చొప్పున 14 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు జరుగుతుందని చెప్పారు. కౌంటింగ్ సమయంలో గ్రీన్, పింక్ పేపర్‌లు సీల్‌ను తీసే క్రమంలో ఏజెంట్లకు తప్పకుండా చూపించిన తర్వాతనే కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది క్రమశిక్షణ పాటించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోని మొబైల్‌ఫోన్లు అనుమతి లేదని, ఎవరైనా అనివార్యంగా తీసుకువస్తే కౌంటింగ్ కేంద్రం బయట ఉంచే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ విధానంలో నిబంధనలు ఉల్లంఘించినట్లైతే సెక్షన్-128 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు నాగేశ్వర్‌రావు, ఇక్బాల్, ఎన్నికల డీటీ సుభాష్, మాస్టర్ ట్రెయినీలు సందీప్‌కుమార్, నాగరాజు, నాగేశ్వర్‌రావు, రమేష్‌లు ఉన్నారు.

హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య


మనోహర్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, మే 31: ఆర్థిక ఇబ్బందులతో హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు నర్సింహనగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య కథనం ప్రకారం. గార్ల మండలకేంద్రానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ బత్తిని మనోహర్ (45) కొంతకాలంగా ఖమ్మంలో నివాసముంటూ మహబూబాబాద్ పోలీస్ కార్యాలయంలో కంట్రోల్ రూంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబ అవసరాలు, కుమారుల ఉన్నత చదువుల కోసంరూ.20లక్షల నుంచి రూ.30 లక్షల వరకు అప్పు చేశాడు. కుమారులిద్దరూ ఉద్యోగంలో స్థిరపడకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపంతో నర్సింహనగర్‌కాలనీలో వేపచెట్టుకు ఉరివేసుకున్నాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య అంజలి, కుమారులు సంపత్, శ్రీకర్ ఉన్నారు. ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



వరంగల్ వ్యవసాయం, మే31: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉఉంది. జిల్లాలో 41.7 నుంచి 45.1డిగ్రీలు నమోదైంది. దీంతో ప్రజలు ఇంట్లో నుంచి బయటకురాలేదు. అత్యావసర పనులు ఉన్నవారు తప్పి తే మిగితా వారెవ్వరు బయట కనిపించలేదు. గీసుగొండ మండలం గొర్రెకుంటలో అత్యధికంగా 45.1డిగ్రీలు, అదే గీసుగొండ మండల కేంద్రంలో 42.7 డిగ్రీ లుగా నమోదైంది. పర్వతగిరి మండలం కల్లెడలో 44.8, ఏనుగల్‌లో 44.5 డిగ్రీలుగా నమోదైంది. చెన్నారావుపేటలో 44.7 డిగ్రీలు, వరంగల్ ఉర్సులో 44.5 డిగ్రీలు, సంగెం మండలం కాపుల కనిపర్తిలో 44.1 డిగ్రీలు, నెక్కొండలో 43.4 డిగ్రీలు నమోదైంది. సంగెంలో 43.8, దుగ్గొండిలో 43.6, వరంగల్‌లోని పైడిపెల్లిలో 43.4 డిగ్రీలు నమోదైంది. అలాగే రాయపర్తిలో 43.4 డిగ్రీలు, నల్లబెల్లిలో 42.7 డిగ్రీలు, నర్సంపేట మండలం లక్నెపల్లిలో 42.4, వర్ధన్నపేటలో 41.7 డిగ్రీ లు నమోదైంది.

విత్తనాలు, ఎరువుల కొరత లేదు


స్టేషన్ రోడ్‌లోని విత్తన షాపులో రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

నకిలీ విత్తనాల నియంత్రణకు చర్యలు : కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మే 31: జిల్లాలో విత్తనాలకు ఎలాంటి కొరత లేదని, రైతులెవరూ ఆందోళన చెందొద్దని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా విత్తనాల లభ్యత, వానకాలం సాగుపై విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల ప్రకారం ఈసారి ముందుగానే రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించనున్నాయని, రైతులు సాగుకు సమాయత్తం అవుతున్న నేపథ్యంలో విత్తనాలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. జిల్లాలో 1.05లక్షల ఎకరాల్లో వరి, 1.28లక్షల ఎకరాల్లో పత్తి, 30వేల ఎకరాల్లో మొక్కజొన్న, 15వేల ఎకరాల్లో మిర్చి పంట సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారన్నారు. ఎవరైనా కృత్రిమ విత్తనాల కొరత సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా, విత్తనాలు ఎమ్మార్పీ ధర కన్నా ఎక్కువ అమ్మినా కంట్రోల్ రూమ్ మొబైల్ నెంబర్ 72888 94714కు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి ఫర్టిలైజర్ డీలర్ షాపు వద్ద కంట్రోల్ రూమ్ నెంబరును విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. జిల్లాలో 3.50లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరం ఉండగా 5.25లక్షల ప్యాకెట్లను విత్తన దుకాణాల డీలర్ల వద్ద అందుబాటులో ఉంచామని, ఇప్పటి వరకు 1.50 లక్షల ప్యాకెట్లు విక్రయించినట్టు కలెక్టర్ పేర్కొన్నారు. నకిలీ విత్తనాల నియంత్రణకు రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ, ఉద్యానశాఖలో టాస్క్‌ఫోర్స్ కమిటీ వేసినట్లు తెలిపారు.

విత్తన విక్రయ దుకాణాలను తనిఖీ చేసిన కలెక్టర్

వరంగల్ నగరంలోని దేవి సీడ్స్, గణపతి, పున్నమి, సీతారామ తదితర విత్తన విక్రయ దుకాణాలల్లో శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్స్ దుకాణంలోని కొనుగోలుకు సంబంధించిన రిజిస్టర్లను, విత్తనాల ప్యాకెట్లను, నిల్వ స్టాక్‌ను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మకూడదని, మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న విత్తనాలను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని, కొనుగోలు, అమ్మకాలపై స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలన్నారు. రైతులు కూడా కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన రశీదులను భద్రపర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి ఉషాదయాల్, ఏడీఏ సురేశ్, ఏఓలు విజ్ఞాన్, సారంగం, తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్

వరంగల్ కలెక్టరేట్, మే 31: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై పీడీ యాక్ట్ నమోదుచేస్తామని కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విత్తన డీలర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీ మాట్లాడుతూ విత్తన డీలర్లు వ్యవసాయ, పోలీసు శాఖలకు సహకరించాలన్నారు. విత్తనాలు లూజుగా అమ్మితే జరిమానాతోపాటు, శిక్షకు కూడా గురికావాల్సి వస్తుందన్నారు. బీటీ-3 విత్తనాలను ప్రభుత్వం నిషేధించిందని, వాటిని ఎవరూ విక్రయించొద్దని స్పష్టం చేశారు. ఇప్పటికే జిల్లాలో ఇద్దరిపై కేసులు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీలు అబ్దుల్ బారీ, రవీందర్, ఏసీపీలు తిరుపతి, కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉషాదయాల్, వ్యవసాయశాఖ అధికారులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.



విత్తన డీలర్ల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, సీపీ

పన్నుల వసూళ్లకు సిబ్బంది నియామకం

వరంగల్ కార్పొరేషన్, మే 31: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థకు సంబంధించిన ఎలాంటి బిల్లులు వసూలు చేసే అర్హత ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లు, ప్రైవేటు ఉద్యోగులకు లేదని సీడీఎంఏ హైదరాబాద్ నుంచి వరంగల్ బల్దియా కార్యాలయానికి సర్క్యులర్ అందిన విషయం తెలిసిందే. కాగా రాష్ట్రవ్యాప్తంగా కొన్ని మునిసిపల్ కార్యాలయాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వసూలు చేసిన డబ్బులను స్వప్రయోజనాల కోసం వాడుకుని చేతులెత్తేసినట్టు హైదరాబాద్‌కు ఫిర్యాదులు అందాయి. రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాల మేరకు బల్దియా పరిధిలో పన్నులు వసూలు చేస్తున్న సిబ్బందిని తొలగించారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో డివిజన్‌కు ఒకరి చొప్పున 66 మంది, ఈ సేవా కేంద్రాలలో బిల్లులు వసూలు చేసేందుకు 10 మందిని నియమిస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల రెవెన్యూ విభాగంలో పని చేసి వీఆర్ఏలు, వీఆర్‌వోలుగా పని చేసిన వారిని ప్రభుత్వం పలు మున్సిపాలిటీలకు నియమించింది. కాగా, కొత్తగా నియమించబడిన వారు బిల్ కలెక్టర్లు, ఈ సేవా కేంద్రాల్లో వార్డు అధికారులుగా పని చేస్తారు. కాగా, కమిషనర్ నియమించిన వారి పేర్లతో కూడిన జాబితాను అధికారికంగా విడుదల చేశారు. అయితే తొలగించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మొదట ఏ విభాగంలో నియమించబడ్డారో అదే స్థానానికి పంపిస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఎక్కువ మంది శానిటేషన్ విభాగంలో పీహెచ్ (పబ్లిక్ హెల్త్) వర్కర్లు ఉండడంతో తేలు కుట్టిన దొంగల్లా కొట్టుమిట్టాడుతున్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి..

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా


ఉద్యోగ విరమణ పొందిన అధికారులతో సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, మే 31: ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. శుక్రవారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఎస్‌ఐ మునీరుల్లా, ఏఎస్‌ఐలు సమ్మెలాల్, శ్యామ్‌సుందర్, సమ్మయ్య, హెడ్‌కానిస్టేబుల్ యాకూబ్‌రెడ్డిలను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సత్కరించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. కుటుంబసభ్యులు ఇచ్చిన సహకారంతో పోలీసులు వారి విధుల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన అనంతరం ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం, యోగం సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్‌ఐలు శ్రీధర్, స్పర్జన్‌రాజ్, చంద్రశేఖర్, ఆర్ఎస్ఐ శ్రవణ్‌కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా రమేశ్‌కుమార్



హసన్‌పర్తి, మే 31: దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన రైతు రమేశ్‌కుమార్ నియమితులయ్యారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగిన డీబీఎఫ్ రాష్ట్ర మహాసభల్లో రమేశ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాకు చెందిన వారికి ప్రాధాన్యం కల్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చుంచు రాజేందర్ (దేవన్నపేట), రాష్ట్ర కమిటీ సభ్యులుగా బొర్ర సంపూర్ణ (హసన్‌పర్తి), మేకల అనిత (హసన్‌పర్తి), భిక్షపతి, కొమ్ముల కరుణాకర్, సురేష్, విజయకు స్థానం కల్పించారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న బడిబాట కార్యక్రమంలో డీబీఎఫ్ భాగస్వామ్యం ఉంటుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలు, విద్యా చైతన్య ఉద్యమాలను చేపడుతామన్నారు. తన నియామకానికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి


ఐలయ్య (ఫైల్)

చెన్నారావుపేట, మే 31: వడదెబ్బతో వృద్ధుడు గురువారం రాత్రి మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. పల్లకొండ ఐలయ్య(75) వడ పందుల కాపరిగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. భార్య గతంలోనే చనిపోగా, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రోజు మాదిరిగానే గురువారం పందులను మేపడానికి ఆరు బయటకు తీసుకెళ్లాడు. రోజంతా ఎండలోనే ఉన్నాడు. సాయంత్రం ఇంటికి రాగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వాంతులు, విరేచనాలు కావటంతో కుటుంబ సభ్యులు స్థానిక వైద్యుడి వద్దకు తరలించారు. అనంతరం ఆస్పత్రి తరలించేందుకు యత్నిస్తుండగా అప్పటికే మృతిచెందాడు. బాధిత కుటుంబానికి ఏకలవ్య సంఘం బాధ్యులు రూ.3 వేలను ఆర్థికసాయం అందించారు. మండల అధ్యక్షుడు పులిచేరు జంపయ్య, ప్రధాన కార్యదర్శి పల్లకొండ తిరుపతి, కార్యదర్శి రాయపురి శ్రీను, పల్లకొండ కుమారస్వామి, వెంకటేష్, మల్లయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

తెలంగాణ బలి దేవత కాంగ్రెస్సే

» వందలాది మంది అమరులయ్యింది ఆ పార్టీ వల్లే...

» అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది?

» కాంగ్రెస్ పదేళ్ల తాత్సారం వల్లే కదా బలి దానాలు: కేటీఆర్



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో వందలాది మంది అమరులయ్యింది ఎవరి వల్ల? అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది.. గతంలో రేవంత్‌రెడ్డి చెప్పినట్లు తెలంగాణ బిడ్డల్ని చంపిన బలి దేవత ఎవరు...? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ప్రశ్నించారు. 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్‌ను ఆయన శుక్రవారం విమర్శించారు. 1952లోనే ఉమ్మడి రాష్ట్రం వద్దని, హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని పోరాటం చేస్తున్న విద్యార్థులపై సిటీ కాలేజీ వద్ద కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొన్నది, 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మంది తెలంగాణ బిడ్డల్ని కాల్చి చంపింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా..? అని నిలదీశారు. 1971 పార్లమెంట్ ఎన్నికల్లో 11/14 సీట్లలో తెలంగాణ ప్రజా సమితి పార్టీని గెలిపిస్తే ఆ పార్టీని మాయం చేసింది, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజాస్వామికంగా తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తే, తెలంగాణను తుంగలో తొక్కింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. 2004లో మాట ఇచ్చి, పదేళ్ల తాత్సారం చేసి వందలాది మంది తెలంగాణ బిడ్డలు ఆత్మ బలిదానం చేసుకునే దుస్థితికి కారణమైంది అప్పుడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్సేనని కేటీఆర్ ఆరోపించారు.

తెలంగాణ తేజం పాటను ఆవిష్కరించిన కేసీఆర్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తేజం పేరిట కేసీఆర్(కేశవ చంద్ర రమావత్) సినిమా కోసం రూపొందించిన పాటను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు. నటుడు రాకింగ్ రాకేష్ నిర్మించిన కేసీఆర్ సినిమాలోని ఆ పాటను శుక్రవారం నంది నగర్‌లోని కేసీఆర్ నివాసంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ డి.దామోదర్ రావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, యాంకర్ జోర్దార్ సుజాత, సింగర్ విహ, గీత రచయిత సంజయ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ర్యాలీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం ర్యాలీ జరగనుంది. రాష్ట్ర అవతరణ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ మూడు రోజులు పాటు నిర్వహించాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్ నుంచి అసెంబ్లీ ఎదుట ఉన్న అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా పాల్గొంటారు.

ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం

» టీవీ, యూట్యూబ్ చానళ్లపై పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర లేకపోయినప్పటికీ కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు ఉద్దేశ్య పూర్వకంగా ఆయన పేరును బదనాం చేస్తున్నాయంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ పార్టీ నేతలతో కలిసి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రభుత్వం కోరినట్టు ఇంటెలిజెన్స్ ఇతర విభాగాల అధికారులు నివేదికలు ఇచ్చారు తప్పితే ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేసీఆర్ పాత్ర ఉన్నట్టు ఎక్కడా నిర్ధారణ కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అరెస్టయిన పోలీసు అధికారులు వాంగ్మూలం ఇచ్చారంటూ కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు కేసీఆర్ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా విష ప్రచారం నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

» ప్రజా సమస్యలు వదిలి.. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్షలా?

» మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేస్తున్నాయని.. దేశంలో శత్రువులుగా ఉంటున్న ఆ రెండు పార్టీలు తెలంగాణలో మిత్రులుగా వ్యవహరిస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్ష చేపట్టడంపై శుక్రవారం ఆయన స్పందించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఫోన్‌ట్యాపింగ్‌పై దీక్ష చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, విపక్ష నాయకుల ఫోన్ల మీద కేంద్రం పెగాసస్ వాడిందన్న ఆరోపణలపై విచారణకు ఎందుకు డిమాండ్ చేయలేదో రాష్ట్ర బీజేపీ నాయకులు చెప్పాలన్నారు.

రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే నకిలీ మద్యం: క్రిశాంక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో నకిలీ మద్యం అమ్ముతున్నారని సీజ్ చేసిన సోమ్ డిస్టిల్లరీస్ కంపెనీని రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడకు తెస్తోందని బీఆర్ఎస్‌నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. మధ్యప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ విభాగానికి ఈ బీరు కంపెనీ.. రూ.575 కోట్ల రుణాన్ని ఎగవేసిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ వాస్తవాలు తెలుసుకోకుండా అటువంటి సంస్థకు ఎలా అనుమతిచ్చారని మంత్రి జూపల్లిని ప్రశ్నించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా వేయండి: ఆర్ఎస్పీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఈ నెల 9న నిర్వహించొద్దని, ఆ పరీక్షను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. అదేరోజు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) పరీక్ష కూడా ఉందని, చాలా మంది నిరుద్యోగులు ఐబీ పరీక్ష రాస్తున్నారని, ఎన్నికల కారణంగా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు సన్నద్ధం కాలేదని తెలిపారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షను నెలరోజులు వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

జోరుగా నిషేధిత బీటీ పత్తి విత్తనాల విక్రయాలు

» రెండు ముఠాలకు చెందిన ఐదుగురి అరెస్ట్



మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషేధిత పత్తివిత్తనాలు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): నిషేధిత బీటీ పత్తివిత్తనాలను విక్రయిస్తున్న రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 1000 కిలోల బీటీ పత్తివిత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పత్తివిత్తనాల రవాణా జరుగుతోందన్న సమాచారంతో మహేశ్వరం ఎస్ఓటీ, మాడ్గుల్ పోలీసులు కలిసి బ్రహ్మంపల్లి గ్రామం వద్ద నిఘా పెట్టారు. కారులో నిషేధిత పత్తి విత్తనాలు తరలిస్తున్న రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కొత్త బ్రాహ్మణపల్లికి చెందిన దుగ్గిపూడి మారెడ్డి (58), అల్లం వినోద్ కుమార్ (42), అల్లం మారెడ్డిని అరెస్ట్ చేశారు. మరో ఘటనలో నాచారంలోని వైష్ణవి అగ్రిటెక్ సంస్థలో పనిచేస్తున్న షాద్‌నగర్‌కు చెందిన ఎర్రదొడ్డి నల్లపారెడ్డి సత్యపాల్‌రెడ్డి (52), కేశంపేటకు చెందిన అన్నపురెడ్డి మల్లారెడ్డి (44)ని అరెస్ట్ చేసి.. వారి నుంచి నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు వేయి కిలోల నిషేధిత పత్తివిత్తనాలు, 5 ఫోన్లు, వేయింగ్ మిషన్, ఓ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేడు గవర్నర్‌ను కలవనునన్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు(శనివారం) కలవనున్నారు. ఉదయం 10 గంటలకు రాజ్‌భవన్‌కు వెళ్లి... గవర్నర్‌తో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని గవర్నర్‌ను సీఎం ఆహ్వానించనున్నారు. కాగా, మహారాష్ట్రలో రుణమాఫీ పథకం అమలు ఎలా జరిగిందనే విషయంపై అధ్యయనానికి రాష్ట్రం నుంచి మహారాష్ట్ర వెళ్లిన అధికారుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో నివేదిక ఇవ్వనుంది.

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)



కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందా..? కేసీఆర్‌పై చర్య తీసుకోకపోవడానికి కారణమేంటి..? ప్రజలకు రేవంత్ సమాధానం చెప్పాలి" అని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, దానిని కక్కిస్తామని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత దిగజారుడు రాజకీయాలకు పాల్పడిందో జైల్లో ఉన్న పోలీసు అధికారుల నేరాంగీకార పత్రాలను పరిశీలిస్తే అర్థమవుతోందని లక్ష్మణ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో వ్యాపారులను హింసించి డబ్బులు వసూలుచేశారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బీఎల్ సంతోష్‌పై పెట్టిన కేసులను పరిశీలించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనుంది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంట్ పెట్టింది. 16 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 19 ఏళ్ల కాల పరిమితితో మరో రూ.1,000 కోట్లను రుణంగా తీసుకోనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.4,000 కోట్ల అప్పు కోసం ఇండెంట్ పెట్టింది. తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని 11 రాష్ట్రాలు రూ.19,500 కోట్ల అప్పుల కోసం ఆర్‌బీఐని ఆశ్రయించాయి. జూన్ 4న జరిగే ఈ-వేలం ద్వారా ఈ అప్పులు తీసుకోనున్నాయి.

కేసీఆర్‌ను కాపాడేందుకే బీజేపీ నేతల ధర్నాలు

» అందుకే సీబీఐ విచారణ కోరుతున్నరు: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కాపాడేందుకే ఆ పార్టీ మిత్రపక్షమైన బీజేపీ.. సీబీఐ విచారణ కోరుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ బీజేపీ నిరసన చేపట్టడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కొమ్ము కాసినందుకు ప్రతిఫలంగా కేసీఆర్‌ను కాపాడాలని ఆ పార్టీ చూస్తోందన్నారు. ట్యాపింగ్ కేసు నుంచి కేసీఆర్‌ను కాపాడడం ఎవరి తరమూ కాదన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీఎల్ సంతోష్‌ను ఇరికించారని చెబుతున్న బీజేపీ.. దాన్ని ఎందుకు నిరూపించలేకపోయిందన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీ అనుబంధ సంస్థగా మార్చేశారనిఎద్దేవా చేశారు. ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడేందుకే బీజేపీ నేతలు ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి.. అప్పట్లోనే కేంద్రానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అసలు మోదీ ప్రభుత్వమే ఫోన్ ట్యాపింగ్‌లు చేస్తుందన్న ఆరోపణలూ ఉన్నాయన్నారు. ముందు ఆ ఆరోపణలపై సీబీఐ విచారణ చేయించుకోవాలని హితవు పలికారు.

అక్టోబరులో స్థానిక ఎన్నికలు!

ఒకేసారి పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. రుణమాఫీ పూర్తయ్యాకే నిర్వహించే అవకాశం

» అప్పటికి బీసీ రిజర్వేషన్లూ కొలిక్కి తెచ్చే కసరత్తు



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకూ ఒకే సారి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయడంతోపాటు బీసీ రిజర్వేషన్ల అంశం తేలాకే ఈ ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో సర్కారు ఉన్నట్లు తెలిసింది. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జూన్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, బీసీ రిజర్వేషన్ల విషయం తేలకపోవడం, కులగణనకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉండడంతో తర్జన భర్జన పడుతోంది. కులగణన వివరాల ప్రకారం కాకుండా.. కేవలం ఓటరు జాబితాలో పేర్కొన్న కులాల వారీగా రిజర్వేషన్లను లెక్కగట్టి ఎన్నికలకు వెళ్తే.. కోర్టుల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. మరోవైపు ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రుణమాఫీ పూర్తయితే ప్రజల్లో సానుకూలత పెరుగుతుందని ఆ పార్టీ భావిస్తోంది. అప్పటిలోగా కులగణనపైనా స్పష్టత వస్తుందని, అక్టోబరులో ఎన్నికలను నిర్వహిస్తే బాగుంటుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

రిజర్వేషన్ల ఖరారుపై సమాలోచన

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ బద్ధంగా రిజర్వేషన్లను కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం ఆయా రాష్ట్రాలు వాటి విచక్షణ మేరకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలను జరుపుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో బీసీ జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. అయితే, రిజర్వేషన్లు 50శాతం కంటే మించకూడదని గతంలో సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీచేసింది. దీంతో ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధ విధానంలో జనాభా దామాషా ప్రకారం పోగా.. మిగిలింది బీసీలకు కేటాయించాల్సి రావడమే సమస్యగా పరిణమించింది. ఈ విధానం కోసమైతే ఓటరు జాబితాను పరిశీలించి, వివరాలు సేకరిస్తే రిజర్వేషన్లను నిర్ణయించవచ్చు. అయితే, అప్పుడు తమకు రిజర్వేషన్ తగ్గిందనే అంశంపై బీసీలు సహా ఎవరైనా కోర్టుకు వెళ్తే మొత్తం ఎన్నికలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 23 శాతానికి తగ్గించింది. ఇదే విధానంలో 2019లో స్థానిక ఎన్నికలను నిర్వహించింది. అప్పుడు కొంతమంది కోర్టుకు వెళ్లడంతో.. ఆ ప్రభుత్వాన్ని కోర్టు ఈ విధానంలో ఎందుకు వెళ్లారంటూ మందలించింది. ఈ ఒక్కసారికి అనుమతించాలని, తరువాత నిర్వహించబోయే ఎన్నికలకు రిజర్వేషన్లను తేల్చి, దాని ప్రకారమే నిర్వహిస్తామని గత ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. కానీ, ఆతర్వాత ఇందుకు అవసరమైన చర్యలను తీసుకోకపోవడం ప్రస్తుత ప్రభుత్వానికి సమస్యగా మారింది. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖరారు చేయాల్సిన బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్ (బీసీ కమిషన్) కృషి చేస్తోంది. కుల సంఘాలతో పాటు, నిపుణులు, ప్రొఫెసర్లతో వరుస సమావేశాలను జరుపుతోంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియగానే ఇందుకు సంబంధించిన పలు అంశాలను సీఎంతోనూ చర్చించి, ఒక నివేదికను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. కాగా, ఆగస్టులో ప్రస్తుత బీసీ కమిషన్ పదవీకాలం ముగియనుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కమిషన్‌నే కొనసాగిస్తుందా, లేక కొత్త కమిషన్‌ను నియమిస్తుందా అన్నది తెలియాల్సి ఉంది.

ఒకే సారి నిర్వహిస్తే...

సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మూడు దఫాల్లో నిర్వహిస్తే.. మూడుసార్లు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ఏదో ఒక ఎన్నిక జరుగుతుండగా.. నెలలపాటు కోడ్ అమల్లో ఉంది. దీంతో ప్రభుత్వ పనులు ఆలస్యమవడంతో పాటు, సామాన్య జనానికి కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితి మళ్లీ పునరావృతం కాకూడదంటే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఒకే సారి నిర్వహించాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ మూడు ఎన్నికలకు రిజర్వేషన్ల అంశం ముడిపడి ఉన్నాయని, జూన్ నుంచి ఆగస్టు వరకు సమయం ఉంటే ఈ అంశాన్ని తేల్చేసే అవకాశం ఉంటుందని సర్కారు భావిస్తోంది. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచనలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు రిజర్వేషన్ల అంశం కొలిక్కి వస్తే.. సెప్టెంబరు లేదా అక్టోబరులో మూడు ఎన్నికలతో గ్రామీణ ప్రాంతాల్లో తీన్ మార్ మోగనుంది.

రూపు మారనున్న మాతా శిశు సంరక్షణ పథకం

కేసీఆర్ కిట్ ఔట్.. ఎంసీహెచ్ కిట్ ఇన్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణకు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన కేసీఆర్ కిట్ పేరును ఇప్పటికే రేవంత్ సర్కారు తొలగించింది. దాని స్థానంలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) కిట్ పేరుతో అమలు చేస్తోంది. అంతేకాక ఈ పథకం రూపురేఖల్ని పూర్తిగా మార్చేయబోతోంది. ప్రధానంగా దీన్ని ఎలా నిర్వహించాలన్న దానిపై కసరత్తు ప్రారంభించింది. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పథకాన్ని నడపాలా? లేక కేంద్రం ఇచ్చే ప్రధాన మంత్రి మాతృవందన యోజన(పీఎంఎంవీవై)తో కలిపి కొనసాగించాలా అన్నదానిపై చర్చిస్తున్నారు. ఈ పథకంపై ఇటీవలే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కోడ్ ముగియగానే కేంద్రం భాగస్వామ్యంతోనా... లేక రాష్ట్ర ప్రభుత్వ నిధులతో దీన్ని నిర్వహిస్తారా అన్న దానిపై స్పష్టత రానుంది.

రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గే ఛాన్స్

ప్రస్తుతం పీఎంఎంవీవై కింద కేంద్రం గర్భిణులకు రూ.6 వేల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. కేంద్రం ఇచ్చే నిధులను తీసుకొని.. దానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కొంత జమ చేస్తే... పాత పద్ధతిలోనే ఎంసీహెచ్ కిట్ కింద రూ. 13 వేలు ఇవ్వవచ్చు. కేంద్ర ప్రభుత్వ పథకంతో కలిపి అమలుచేయడం వల్ల రేవంత్ సర్కారుపై ఆర్థిక భారం కూడా సగానికిపైగా తగ్గుతుంది. ఇదే విషయాన్ని అధికారులు మంత్రికి వివరించినట్లు తెలుస్తోంది. కాకపోతే కేంద్రం నిధులను ఈ పథకం కింద వినియోగిస్తే... కచ్చితంగా పేరు, బ్రాండింగ్‌లో వారి నియమ నిబంధనలను పాటించాల్సివుంటుందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. దీంతో రెండు రకాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జూన్ 4 తర్వాత తుది నిర్ణయం తీసుకుందామని అధికారులకు మంత్రి సూచించినట్టు చెప్తున్నారు.

తెలంగాణ చిహ్నంలో అమరుల స్థూపం పెడితే.. మీకెందుకు బాధ?

» కీరవాణికి ఆస్కార్ వచ్చినప్పుడు.. కేసీఆర్, కేటీఆర్ అభినందించలేదా?

» మహేష్ కుమార్ గౌడ్

» సమ్మక్క సారలమ్మలను చంపింది కాకతీయరాజులు కాదా?: బెల్లయ్యనాయక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): "ఉద్యమకారుల అభిప్రాయం మేరకు తెలంగాణ చిహ్నంలో అమరవీరుల స్థూపం పెడితే మీకెందుకు కడుపు నొప్పి?" అంటూ బీఆర్ఎస్ నేతలను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజమైన తెలంగాణ వాదులు కోరుకున్న దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ అడుగులు పడుతుంటే.. కేసీఆర్ కుటుంబం నానా యాగీ చేయాలని చూస్తుందన్నారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అమరుల స్థూపానికి రూ. వంద కోట్లు వెచ్చించిన కేసీఆర్ ప్రభుత్వం.. అందులో ఒక్క అమరవీరుని పేరయినా చెక్కిందా అని ప్రశ్నించారు. చిన జీయర్ స్వామిని తీసుకువచ్చి కుర్చీలో కూర్చోపెట్టినప్పుడు, అందెశ్రీ గీతాన్ని సీమాంధ్ర గాయకుడు రామకృష్ణతో పాడించినప్పుడు, ప్రభుత్వ అంబాసిడర్లుగా రకుల్ ప్రీత్ సింగ్, మంచు లక్ష్మీ, పుల్లెల గోపీచంద్‌లను నియమించినప్పుడు, రోజా ఇంటికి వెళ్లి ఆంధ్రా బిర్యానీని తిన్నప్పుడు, పనికిరాని ఒక ప్రాజెక్టును కట్టి.. దాని ప్రారంభోత్సవానికి ఏపీ సీఎంను ఆహ్వానించినప్పుడు, శారదాపీఠానికి తెలంగాణలో భూములు ఇచ్చినప్పుడు కేసీఆర్‌కు సెంటిమెంటు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కీరవాణికి ఆస్కార్ అవార్డు వస్తే.. ఇదే కేసీఆర్, కేటీఆర్ ట్విట్టర్ వేదికగా అభినందించారని గుర్తుచేశారు. ఒక మంచి గీతానికి సంగీతం సమకూర్చేందుకు కీరవాణిని సంప్రదిస్తే.. నానా యాగీ చేస్తున్నారని విమర్శించారు. కీరవాణి ఎంపిక అన్నది అందెశ్రీ ఆలోచనేనని వెల్లడించారు. మెజారిటీ ప్రజల అభిప్రాయం ప్రకారం తెలంగాణ చిహ్నం ఎంపిక జరుగుతుందన్నారు. మల్లు రవి మాట్లాడుతూ 2023 ఎన్నికలకు ముందే.. టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి రాచరిక పాలన తీసేసి ప్రజా పాలన తీసుకువస్తామని చెప్పారని, అందులో భాగమే రాచరిక చిహ్నాల తీసివేతన్నారు. ప్రజా పాలనలో భాగంగానే జయజయహే తెలంగాణ పాటని అధికారిక గేయంగా చేస్తున్నట్లు చెప్పారు."తెలంగాణ చిహ్నంలో కాకతీయుల కళాతోరణం కావాలా...?అమరవీరుల స్థూపం వద్దా? సమ్మక్క, సారలమ్మలను చంపింది కాకతీయ రాజులు కాదా? నాతో సహా.. రాష్ట్రంలో 12% ఉన్న గిరిజనులు కాకతీయ కళాతోరణాన్ని ఎందుకు ఒప్పుకోవాలి?" అంటూ టీపీసీసీ ఆదివాసీ సెల్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ప్రశ్నించారు. అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గేయం విషయంలో దేశపతి శ్రీనివాస్, వి. ప్రకాష్ కోడిగుడ్డుపై ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. "అందెశ్రీ కాల్ రికార్డింగ్‌లను విడుదల చేస్తారా? ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకున్న ప్రైవేటు డిస్కషన్ రికార్డును ఎలా విడుదల చేస్తారు?" అంటూ ధ్వజమెత్తారు.

పిల్లల కోసం బెంగ!

3 రోజులుగా శిశు విహార్ వద్దే పెంపుడు తల్లిదండ్రుల నిరీక్షణ

» అన్నం తింటున్నారో లేదో.. ఆరోగ్యం ఎలా ఉందో అంటూ కన్నీళ్లు

» ఒక్కసారి చూస్తాం.. లోపలికి అనుమతించండి అని వేడుకోలు

» లోపల ఉన్న 14 మంది చిన్నారుల్లో ఇద్దరు పిల్లలకు జ్వరం?

» 'కారా' రూల్స్ సడలించాలంటున్న స్వచ్ఛంద సంస్థలు

» విచారణ ముగిసేదాకా పిల్లలను చూసే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి

» సొంత తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. పిల్లలను అప్పగించండి:మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ, పంజాగుట్ట, మే 31 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కనకున్నా.. ఆ పిల్లలను ఆ తల్లులు ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్నారు. వారే లోకంగా బతుకుతున్నారు. అలాంటిది.. తమ వద్ద నుంచి పిల్లలను దూరంచేస్తే ఆ తల్లిండ్రులు బాధపడరా? పది నిమిషాలు కనిపించకపోతేనే తల్లడిల్లిపోయే స్థితిలో మూడు రోజులుగా పిల్లలను చూడకుండా ఉన్న ఆ తల్లిదండ్రుల ఆవేదన ఏ స్థాయిలో ఉంటుంది? ఇదంతా యూసుఫ్‌గూడలోని శిశువిహార్ పరిసరాల్లో కళ్లకు కడుతోంది. నిజమే.. సెంట్రల్ ఆడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) నిబంధనలకు విరుద్ధంగా దత్తత తీసుకొని తప్పే చేశాం అంటూ లెంపలేసుకొంటూనే.. తమ బిడ్డల్ని ఒక్కసారి చూపించండి అంటూ అధికారులను తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. శిశువుల విక్రయానికి సంబంధించి అంతర్రాష్ట్రముఠా గుట్టురట్టవ్వడంతో మూడు రోజుల క్రితం వివిధ చోట్ల నుంచి 14మంది శిశువులు, చిన్నారులను పోలీసులు స్వాధీనం చేసుకొని యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో అప్పగించారు. వీరిలో 12 మంది నెలల వయసు పిల్లలుండగా ఇద్దరు మూడేళ్లలోపు ఉన్నారు. శిశు విహార్‌లో ఉన్న తమ చిన్నారులు ఎలా ఉన్నారో? అన్నం తింటున్నారో లేదో? ఆరోగ్యం ఎలా ఉందో? అనే ఆలోచనతో పెంపుడు తల్లిదండ్రులు ఆకలిదప్పులూ పట్టకుండా బెంగటిల్లుతున్నారు. పిల్లలు వైద్యులపర్యవేక్షణలో ఉన్నా కొందరు జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

దత్తత ప్రక్రియ ఆలస్యం.. సంక్లిష్టం!

పొరుగు రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ, ఏపీలో పిల్లల దత్తత ప్రక్రియలో తీవ్ర ఆలస్యం జరుగుతుంది. ఈ కారణంగానే పిల్లలు లేని దంపతులు నిబంధనలకు విరుద్ధంగా శిశువులను దత్తత తీసుకుంటున్నట్లు సమాచారం. మహారాష్ట్ర, కర్ణాటకలో దరఖాస్తు చేసుకున్న ఆరు నుంచి ఏడాదిలోపు పిల్లల దత్తత ప్రక్రియ పూర్తవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం రెండు, మూడేళ్లు పడుతోందని స్వచ్ఛంద సంస్థల బాధ్యులు చెబుతున్నారు. పిల్లలను దత్తత తీసుకోవాలంటే తొలుత.. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత పాన్‌కార్డు నంబర్, రెసిడెన్స్ ప్రూఫ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వివాహ నమోదు పత్రం, దంపతుల బర్త్, హెల్త్ సర్టిఫికెట్లు సమర్పించాలి. భార్యాభర్తల పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతోపాటు ఇద్దరు కలిసి దిగిన పెళ్లి ఫొటోను కూడా దరఖాస్తుతో సమర్పించాలి. అలాగే రూ.6వేల డీడీ అప్లికేషన్ ఫారంతోపాటు రూ.40 వేలు దత్తత తీసుకునే సమయంలో సంబంధిత అనాథాశ్రమానికి లేకుంటే ప్రభుత్వ సంస్థలకు చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న అనంతరం రెండు నుంచి మూడేళ్లకు పిల్లలను దంపతులకు అప్పగిస్తారు. అప్పగించిన తర్వాత కూడా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పిల్లలను పర్యవేక్షించాలి. దత్తత తీసుకున్న జంటల ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? వారు పిల్లాడిని బాగా చూసుకుంటున్నారా? లేదా? అనేవి ప్రతి ఆరు నెలలకోసారి పరిశీలించాలి. ఈ సందర్భంగా సదరు తల్లిదండ్రుల నుంచి ఆరునెలలకోసారి రూ.2వేల చొప్పున తీసుకుంటారు.

3 రోజులుగా పడిగాపులు పడుతున్నాం

నా పేరు అరుణ. భర్త పేరు సాయి. మాది ఏపీలోని చీరాల సమీపంలోని బోయనపాలెం. పిల్లలు కలగకపోవడంతో ఐదు నెలల బాబును ఓ నర్సు ద్వారా తెచ్చుకున్నాం. బాబుకు శ్రీమన్విత్ అని పేరు పెట్టుకున్నాం. మా అమ్మకు నేను ఒక్కదాన్నే కావడంతో ఆమె ఎంతో ప్రేమతో నా బాబుకు ఎకరన్నర పొలం రాసేందుకు సిద్ధమైంది. ఇంతలోనే పోలీసులు మా బాబును తీసుకొచ్చి శిశువిహార్‌లో పెట్టారు. 3 రోజులుగా ఇక్కడే ఉన్నాం. చూసేందుకు అవకాశం ఇవ్వడం లేదు. దయచేసి మా బాబును మాకు ఇప్పించండి. - అరుణ, చీరాల, ఏపీ

3 నెలల్లోపు దత్తత ఇవ్వాలి

సమాజంలో చాలా జంటలు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నారు. అలాంటి వారికి పిల్లలను దత్తత తీసుకునే అవకాశాన్ని త్వరగా కల్పించాలి. కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నాక మూడు నెలల్లో చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ పూర్తి అయ్యేలా నిబంధనలు సడలించాలి. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలి. ప్రస్తుతం యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో ఉంటున్న పిల్లలను చూసే అవకాశాన్ని మానవతా దృక్పథంతో తల్లిదండ్రులకు కల్పించాలి.

-డాక్టర్ మమతా రఘువీర్,
తరుణి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు

ప్రతి జిల్లాలో శిశువిహార్ పెట్టాలి



దత్తత కార్యక్రమం ఆలస్యమవుతుండడంతోనే చాలా మంది పిల్లలను అక్రమ పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దత్తత టైం లిమిట్ తగ్గించి సకాలంలో పిల్లలను అప్పగిస్తే దంపతులు సంతోషంగా ఉండటంతోపాటు సంరక్షణను బాధ్యతగా నెరవేరుస్తారు. ప్రభుత్వం కూడా ప్రతి జిల్లాలో శిశువిహార్ కేంద్రాలు పెట్టాలి. తద్వారా అనాథ పిల్లలకు ఆశ్రయం అందుతోంది.

-రేవతి, హైకోర్టు న్యాయవాది

పాప పేరిట ఆస్తి కూడా రాశాం



ఈ దంపతులు పేర్లు పెరుగు దుర్గాభవాని, చక్రపాణి. వీరిది ఏపీలోని బాపట్ల జిల్లా కర్లపల్లి మండలం చింతాయపాలెం. పెళ్లయి 20 ఏళ్లయినా సంతానం కలగకపోవడంతో మూడేళ్ల క్రితం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సు సాయంతో 8 రోజుల పాపను రూ.1.5 లక్షలకు కొనుగోలు చేశారు. అధికారులొచ్చి తమ పాపను తీసుకెళ్లడంతో శిశువిహార్ వద్ద పడిగాపులు పడుతున్నారు. పాపకు భవ్యశ్రీ అని పేరు పెట్టుకొని, మూడేళ్లుగా పెంచుకుంటున్నామని.. ప్రాణం కంటే ఎక్కువగా చూసుకున్నామని చెప్పారు. "పాప పేరిట ఆస్తిని అంతా రాశాం. మంత్రి సీతక్క ఆఫీస్ అడ్రస్ చెప్పండి సార్.. అక్కడికి వెళ్లి అమ్మను ప్రాధేయపడి పాపను తీసుకెళ్తాం" అని ఈ దంపతులు అడుగుతున్నారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు : సీతక్క



పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని శిశువిహార్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల కుటుంబసభ్యుల వివరాలు సేకరించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చి చిన్నారులను అప్పగించాలని సూచించారు. సంతానం లేని దంపతులు ప్రభుత్వ అనుమతితో, చట్టపరంగా దత్తత తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, దత్తత కోసం చట్టపరమైన ప్రక్రియను అనుసరించాలని పేర్కొన్నారు. పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



దత్తక్షేత్రంలో సామూహికంగా వ్రతాలు

దత్తక్షేత్రంలో సామూహిక వ్రతాలు

వరంగల్ కల్చరల్, మే 31: అనఘాష్టమి వ్రతాన్ని ఆచరిస్తే ఆరోగ్యం, ఐశ్వర్యం కలుగుతాయని దత్త ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం దత్తక్షేత్రంలో సామూహిక అనఘాష్టమి వ్రతాలను ఆచరించారు. అనంతరం అన్నప్రసాదం గావించారు. అర్చకులు రాపాక గోపీకృష్ణశర్మ, ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు, ప్రొఫెసర్ కె.కృష్ణప్రసాద్, యుగంధర్, వడిచెర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. నేడు హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని నిర్వాహకులు వైవీ వామన్‌రావు తెలిపారు.

'రిజిస్ట్రేషన్'కు కొత్త హంగులు

● మోడల్ కార్యాలయాలుగా మార్చేందుకు సర్కారు యత్నం ● వేయిటింగ్ హాళ్లు, కేఫెటేరియాలు ఏర్పాటు ● మౌలిక వసతుల ఏర్పాటు





ఉర్సు గుట్ట వద్ద ఉన్న ఖిలా వరంగల్ సబ్ రిజిస్టర్ కార్యాలయం రిజిస్ట్రేషన్ కోసం వచ్చి చెట్లకింద ఉన్న వినియోగదారులు

వరంగల్ సిటీ, మే 31: రాష్ట్రంలో అత్యధిక ఆదాయాన్ని సమకూర్చేది రిజిస్ట్రేషన్ కార్యాయాలు. ఆ కార్యాలయాలు త్వరలో ఆధునిక హంగులను సంతరించుకోనుంది. వేయిటింగ్‌హాళ్లు, కేఫెటేరియాలు, తాగునీరు ఏర్పాటు చేసి మాడల్ కార్యాలయాలుగా మారనున్నాయి. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల పనితీరుపై సమీక్షా సమావేశంలో అధునాతన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వచ్చే భూ క్రయవిక్రయదారులు చెట్ల కింద, పార్కింగ్ ప్లేసుల్లో, డాక్యుమెంట్ రైటర్ వద్ద, పాన్ డబ్బాల వద్ద వేయిటింగ్‌కు ఇక చెక్ పడనుంది. ఇందుకోసం వేయిటింగ్ హాళ్లు, కేఫెటేరియాలు, తాగునీరు లాంటి సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు సర్కారు సమాయత్తమవుతోంది. రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వినియోగదారులు వేలు, లక్షల రూపాయలు రిజిస్ట్రేషన్ కోసం చెల్లించినప్పటికీ వారికి అక్కడ కనీస సౌకర్యాలు ఉండవు. రిజిస్ట్రేషన్ అయ్యేంతవరకు దానికి సంబంధించిన క్రయవి క్రయదారులందరు కార్యాలయాల సమీపంలో రిజిస్ట్రార్ పిలుపు కోసం ఎదురు చూస్తుంటారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ కార్యా యాలకు వచ్చేవారి గురించి పట్టించుకోలేదని, సీఎం రేవంత్‌రెడ్డి మంచి నిర్ణయం తీసుకున్నారని వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సొంత భవనాలు ఉండి అధిక ఆదాయాన్ని సమకూర్చే రిజిస్ట్రేషన్, సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను మొదటి విడతలో మోడల్ కార్యాలయాలుగా తీర్చి దిద్దనున్నారు. వరంగల్ జిల్లాలో రెండు సొంత భవనాలతో కూడిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలున్నాయి. ఒకటి వరంగల్‌లోని కొత్తవాడలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం, రెండోది ఉర్సు గుట్ట వద్ద ఖిలావరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉన్నది. ఈ రెండు కార్యాలయాలు మోడల్ కార్యాలయాలు మారే అవకాశాలున్నాయి.

సీఎం మంచి నిర్ణయం తీసుకున్నారు

రవికుమార్, ఐనవోలు



రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఆధునిక హంగులతో వేయిటింగ్‌హాళ్లు, కేఫెటేరియాలు, తాగునీరు ఏర్పాటు చేసి మోడల్ కార్యాలయాలుగా తీర్చిదిద్దడమనేది మంచి ఆలోచన. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కనీస వసతులు లేవు. అధిక ఆదాయమున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఇప్పుడు ఆ సమస్య తీరనుంది.

గోవుల అక్రమ రవాణాను నిషేధించాలి

ఖిలావరంగల్, మే 31: గోవుల అక్రమ రవాణా, గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ, భజరంగ్ దళ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో సీఐ మల్లయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బొమ్మ నాగ రాజు మాట్లాడుతూ ఇటీవల కాలంగా జిల్లాలో గోవుల అక్రమ రవాణా ఎక్కువైందని, గోవుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందని వాపోయారు. గోవులను వధించి, బహిరంగప్రదేశాలలో రోడ్ల పక్కన, జనసంచారం కలిగిన ప్రదేశాలలో గోవుల మాంసాన్ని విక్రయిస్తున్నారన్నారు. దీంతో హిందువు మనోభావాలు దెబ్బ తింటున్నాయన్నారు. ఇలాంటి చర్యలను ప్రభుత్వం కఠినంగా నిషేదించాలన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూపరిషత్ ఖిలా ప్రఖండ కార్యదర్శి తాళ్ళపల్లి రమేష్, గోరక్షా ప్రముఖ్ సంగినేని రాజేష్, ఖిలావరంగల్ భజరంగ దళ్ సంయోజక్ తుంగ సతీష్, పల్లె ప్రదీప్, ఎల్లం భరత్, విటల్‌రెడ్డి, చతుర్‌గంజి శ్రీకర్, కాలచర్ల వంశీకృష్ణ, పోశాల శ్రీను, ఇనుముల సతీష్, రావుల శేఖర్, బూర నాగరాజు, మేకల ప్రవీణ్, మిరియాల రవి, తౌటం భరత్, శివప్రసాద్, పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన వారికి జరిమానా

మట్టెవాడ, మే 31: వరంగల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనం నడిపిన వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి శుక్రవారం విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ శ్రీదర్ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన ఐదుగురు వాహనదారులకు రూ. 4300, మద్యం తాగి వాహనం నడిపిన వాహనదారులకు ఏడుగురుకి రూ. 4800 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

ఏనుమాముల మార్కెట్లో అన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

వరంగల్ వ్యవసాయం, మే 31: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లోని శ్రీలక్ష్మి గణపతి సహిత అభయాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం మహా అన్నదానం నిర్వహించారు. శ్రీహనుమాన్ జయంతిని పురస్కరించుకుని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి గోమాతకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డి, చాంబర్ ప్రతినిదులు మడూరి వేదప్రసాద్ హాజరయ్యారు.

సినీ నటుడు కృష్ణ జయంతి వేడుకలు

చెన్నారావుపేట, మే 31: ప్రముఖ సీని నటుడు, దివంగత కృష్ణ జయంతి వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ చిత్ర పటం వద్ద అయన అభిమాని గొడిశాల స్వామి కెక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గొడిశాల స్వామి మాట్లాడారు. కృష్ణ నటనతో అందరిని మెప్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, మల్లయ్య, భూపాల్, నర్సయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విప్లవ ప్రజా ఉద్యమాలతో పేదల రాజ్యం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న చిన్నచంద్రన్న

నర్సంపేట టౌన్, మే 31: బలమైన విప్లవ ప్రజా ఉద్యమాలతో పేదల రాజ్యం సాధ్యమవుతుందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాయం చిన్నచంద్రన్న, రాయల చంద్రశేఖర్, గడ్డం సదానందంలు అన్నారు. మండలంలోని మహేశ్వరంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు జిల్లా కార్యదర్శి చిర్ర సూరి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 50 ఏళ్లుగా పేదల రాజ్య స్థాపన కోసం అనేక రకాల పోరాటాలు జరిగాయని, నేటికీ జరుగుతూనే ఉన్నాయని, గాంధీల రాజ్యం గడిచి, గాడ్సేల రాజ్యాలు వచ్చాయన్నారు. కానీ కమ్యూనిస్టు పార్టీలు ఎన్నికల్లో పాల్గొన్నప్పటికీ రాజ్యాధికారం సాధించేందుకు ఇంకా పేదల రాజ్యం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత పోరాట, ఉద్యమ అనుభవాలను సమీక్షించుకొని విప్లవ శక్తులు విడివిడిగా ఉంటే ప్రయోజనం లేదని, దేశ వ్యాప్తంగా ఉన్న విప్లకారులందరినీ ఐక్యం చేయాలనే సంకల్పంతో ఈ ఏడాది మార్చి మొదటివారంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) రెవల్యూషనరీ ఇనిషియేటివ్, పీసీసీ సీపీఐ(ఎంఎల్) మూడు విప్లవ పార్టీలు ఏకమై కార్మిక వర్గ పోరాటాలలో కలిసి జమిలీగా పోరాడితేనే పేదల రాజ్యం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మైదం పాణి, అర్షం అశోక్, ఎ. శ్రీనివాస్, స్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి పూర్తి చేయండి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, మే 31: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనుల పురోగతిపై సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో మిగిలి ఉన్న పెయింటింగ్ పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన పనులను పరిశీలించి జూన్ 10వ తేదీలోగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు. స్కూల్ యూనిఫాం తయారీపై సమీక్షించి కుట్టుపని పూర్తయిన యూనిఫామ్‌లను ఆయా మండలాల ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు అందజేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్‌డీవో కౌసల్యదేవి, డీఈవో వాసంతి, స్పెషల్ ఆఫీసర్లు, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

తోపనగడ్డతండాలో బాలిక అదృశ్యం

చెన్నారావుపేట, మే 31: మండలంలోని తోపనగడ్డతండాలో ఓ బాలిక అదృశ్యమైంది. ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన పానుగంటి రజిత(17) ఇంటి వద్దనే ఉంటూ తల్లిదండ్రులకు పనుల్లో సాయం చేసేది. ఈ నెల 28రాత్రి సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన రజిత తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా బాలిక అచూకీ లభించలేదు. బాలిక సోదరుడు నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెలూన్ షాపులో చోరీ

చెన్నారావుపేట, మే 31: మండలంలోని జల్లి గ్రామంలో ఓ సెలూన్ షాపులో చోరీ జరిగిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. బాధిత కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వల్లాజీ బాలాజీ తన సెలూన్ షాపులో రూ. 56 వేలను దాచి పెట్టాడు. రోజు వారి మాదిరిగానే గురువారం రాత్రి షాపుకు తాళం వేసి ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలను పగలగొట్టి షాపులో ఉన్న రూ .56 వేలను ఆపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు.

నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలి

వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య

వర్ధన్నపేట, మే 31: మార్కెట్‌లో నకిలీ విత్తనాల బెడద ఎక్కువగా ఉందని నాణ్యమైన విత్తనాలనే రైతులు కొనుగోలు చేసి అధిక దిగుబడులు పొందాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నకిలీ విత్తనాల బెడద ఎక్కువగా ఉండడం వల్ల రైతులు నష్టపోకుండా మంచి విత్తనాలను కొనుగోలు చేసి అధిక దిగుబడులు పొందాలని డివిజన్ పోలీసుల తరుపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రైతాంగం మా ర్కెట్‌లో విత్తనాలు కొనుగోలు చేస్తున్నపుడు ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలని ఎక్కడైనా తక్కువ ధరకు వస్తున్నాయని ఆశపడి నకిలీ విత్తనాలను తీసుకుంటే ఆ తరువాత భారీగా నష్టపోతారన్నారు. ఎవరైనా, ఎక్కడైనా నకిలీ విత్తనాలను చూసినా, మీ దృష్టికి వచ్చినా వెంటనే స్థానిక పోలీసుస్టేషన్, వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఏసీపీ సూచించారు.

వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపు ల్లో పోలీసు, వ్యవసాయశాఖల అధ్వర్యంలో అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ఏవో సాగరిక, ఏఈవో సలావుద్దీన్, పోలీసులు బుచ్చిరాజు, బొజ్జు భరత్ తదితరులు పాల్గొన్నారు.

● నెక్కొండ: మండలంలోని వివిధ గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల విక్రయ షాపులను శుక్రవారం సీఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీచేశారు. రైతులకు విక్రయించే ఎరువులు, పురుగుమందులకు తప్పకుండా రైతులకు బిల్లు ఇవ్వాలని, ప్రతి షాపు ఎదుట ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని సూచించారు. విక్రయాలకు, స్టాక్‌కు సంబంధించి ప్రతి రోజు వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. కల్తీ విత్తనాలు అమ్మితే 8712685236 నెంబర్‌కు సమాచారం అందజేయాల న్నారు. ఈ దాడుల్లో ఎస్సై మహేందర్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



నెక్కొండలోని ఓ ఎరువుల షాపులో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

● చెన్నారావుపేట: మండలంలోని పలు గ్రామాల్లోని విత్తన విక్రయ కేంద్రాలను శుక్రవారం పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నెక్కొండ సర్కిల్ సీఐ చంద్రమోహన్, ఏవో శశికుమార్, ఎస్సై గూడ అరుణ్‌కుమార్, పోలీసుల సిబ్బంది, ఏఈవోలు పాల్గొన్నారు.

పంట వ్యర్థాలను కాల్చొద్దు..

వరంగల్ వ్యవసాయం, మే 31: వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న సాగు చేసి పంట చేతికి వచ్చిన అనంతరం వాటి కొయ్యల(అవశేషాలు/వ్యర్థాలు) ను ఆదే పొలాల్లోనే కాల్చొద్దని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. వాటిని కల్చే బదులు కలియ దున్నితే భూసారం కూడా పెరుగుతుందంటున్నారు. ఇలా వ్యర్థాలను కాల్చడంతో పర్యావరణం దెబ్బతింటోంది. జిల్లాలో మొక్కజొన్న, వరి 30 నుంచి 40 శాతం, పత్తి 90 నుంచి 95 శాతం అవశేషాలు నిప్పు పెట్టి కాల్చివేస్తున్నారు. పర్యావరణ కాలుష్య కారకాలైన సీఓ, సీవో 2, ఎన్-2 ఓ, ఎస్-2ఓ విడుదల అవుతుందని ఇది పర్యావరణనాకి చేటు చేస్తుంది. అలాగే గాలి నాణ్యత తగ్గడం, భూసారం క్షీణించడం, నత్రజనీ కార్బనస్థాయి తగ్గడం, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు, కీటకాలు చనిపోతాయని అధికారులంటున్నారు. నేలలో కలియ దున్నితే నత్రజని 1.2 నుంచి 2 కిలోల వరకు, బాస్వరం 1.3 నుంచి 1.6 కిలోల వరకు అందుతుంది.

వ్యర్థాలను ఇలా ఉపయోగించుకోవచ్చు.

● వ్యర్థాలనుపశువులకు మేతగా ఉపయోగించడం వాడుకోవడం.

● సేంద్రియ ఎరువులలో కంపోస్టింగ్, పుట్ట గొడుగుల సాగు కోసం ఉపయోగించవచ్చు.



పొలాల్లోనే పంట వ్యర్థాలను కాల్చివేసిన రైతులు

● అవశేషాల నుంచి బయోఇథనాల్ ప్యాకింగ్ మెటీరియల్ కోసం ఉపయోగపడుతుంది.

● నేలలో కలియ దున్నడంతో కార్బన స్థాయి పెరగడం, గాలి ప్రసారం, భూ భౌతిక లక్షణాలు పెరుగుతాయి.

● అవశేషాలను ట్రాక్టర్ బెల్లర్ సహాయంతో వరిగడ్డిని చుట్టలుగా చుట్టుకోవచ్చు.

కళా తోరణాన్ని తొలగిస్తే ఉద్యమిస్తాం .. ఎంపీ రవిచంద్ర

మట్టెవాడ, మే 31: తెలంగాణ రాష్ట్ర చిహ్నం కాకతీయ కళా తోరణాన్ని తొలగిస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే తెలంగాణ చరిత్ర మరుగున పడిందని, ఇంకా కనుమ రుగు చేయాలనుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సరికాదన్నారు. పదేళ్ల కేసీఆర్ పా లనలో తెలంగాణ ఖ్యాతిని ఖండంతరాలు దాటించారని, ఇలాంటి చరిత్ర ఆనవాళ్లను తుడిచివేయాలనే ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకో వాలన్నారు.

'దూమపానం ఆరోగ్యానికి హానికరం'

శంభునిపేట, మే 31: దూమపానం, మద్యపానం ఆరోగ్యాని కి హానికరమని రంగశాయిపేట పట్టణ ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.మాధవి అన్నారు. అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం పీహెచ్‌సీలో నిర్వహించారు. సామాజిక కార్యకర్త మండల పరశురాములు, డాక్టర్ మాధవిలు మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తులకు ప్రజలలు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పి విజయలక్ష్మీ, ఏ భాగ్యలక్ష్మీ, టి విజయ జయమణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మాధవి

కాశీవిశ్వేశ్వర ఆలయంలో పూజలు

శంభునిపేట, మే 31 : హనుమాన్ జయంతోత్సవాలను పురస్కరించుకొని రంగశాయిపేటలోని కాశీవిశ్వేశ్వర వీరాంజనేయుని ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు కృష్ణమాచారి, ప్రవీణ్, మాలధారులు అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొలుగొడ్డు సారయ్య, విలాసాగరం విశ్వనాదం, లక్కాకుల రాహుల్, దారబోయిన అనిల్, నగేష్, విలాసాగరంల శ్రీను, బొలుగొడ్డు బుచ్చిబాబు, శ్యామ్, మనోహర్, నీరజ్ వర్మ, అంకం సురేష్, గరిగె నవీన్ పాల్గొన్నా రు. హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం కాశీ విశ్వేశ్వర ఆలయం, రామలింగేశ్వరాలం, రామాలయం, శంభునిపేటలోని కార్యసిద్ధి హనుమాన్ మందిరం, విశ్వనాథకాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయం, సాయినగర్ కాలనీ, గణేష్ నగర్‌లలోని హనుమాన్ మందిరాలలో ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.



రంగశాయిపేట హనుమాన్ పూజలో పాల్గొన్న భక్తులు

కళాతోరణాన్ని తొలగించొద్దని టీడీపీ నిరసన

ఖిలావరంగల్, మే 31: కాకతీయుల కళా తోరణాన్ని రాజముద్రిక నుంచి తొలగించొద్దని టీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి చిలువేరు రవిందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్య కోటలోని కీర్తితోరణాల సమీపంలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీ.శ 11వ,శతాబ్ధం నుంచి 14వ, శతాబ్ధం 300 సంవత్సరాల వరకు కాకతీయ రాజులు దక్షిణ భారతదేశాన్ని సుభిక్షంగా పరిపాలించారన్నారు. వారి కాలంలో పాడిపంటలు, గొలుసు కట్టు చెరువులు, బావులు, కుంటలు, తటాకాలను తవ్వి పంటలను అభివృద్ధి చేశారన్నారు. కాకతీయులు కళాపోషకులని, అంతటి ప్రాముఖ్యమున్న కళా తోరణాన్ని రాజ ముద్రిక నుంచి తొలగిస్తే ఊరుకోమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాగూర్ గణేష్‌సింగ్, కంద్రాతి శ్రీకాంత్, బజ్జూరి వీరేశం, కంద్రాతి రాజు, కంద్రాతి రవి పాల్గొన్నారు.



కళాతోరణం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

సంగెంలో ఎఫ్‌సీ పాస్ బుకింగ్ ప్రారంభం

సంగెం, మే 31: మండల కేంద్రంలోని ప్రాంతీయ గ్రామీ ణ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎఫ్‌సీ పాస్ బుకింగ్‌ను బ్యాంకు మేనేజన్ సుల్తాన్ వెంకయ్య ప్రారంభించారు. దేశంలోనే మొట్టమొదటిగా ఇదివరకు ఎక్కడా లేని విధం గా మైక్రో ఏటీఎం ద్వారా వరంగల్ రీజియన్‌లోనే సంగెం బ్రాంచి ఈ బుకింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని బ్యాంక్ మేనేజర్ చెప్పారు. సంగెంలోని బ్యాంక్ మిత్ర నెల్లుట్ల సుహాసిని వద్ద పాస్ బుకింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. బ్యాంక్ ప్రతి ఖాతాదారుడు ఉచితంగా పాస్ బుక్ సేవలు పొందవచ్చన్నారు. వినియోగదారులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బ్యాక్ క్యాషియర్ జగదీష్, బ్యాంక్ ప్రతినిధి రాజు, చానల్ మేనేజర్ కక్కెర్ల అనిల్, ఖాతాదారులు వేల్పుల కుమారస్వామి పాల్గొన్నారు.

పెట్రోలు బంక్‌లో విజిలెన్స్ అధికారుల తనిఖీ

ఖానాపురం, మే 31: మండల కేంద్రం శివారులోని ఓంసాయి పెట్రోలు బంక్‌లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, తూనికలు కొలతల అధికారులు శుక్రవారం తనఖీ చేశారు. మండల కేంద్రానికి చెందిన ఓ ద్విచక్రవాహనదారుడు పెట్రోలులో నీళ్లు వచ్చాయని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్లు రాకేష్, అనిల్‌కుమార్, లీగల్ మెట్రాలజి జిల్లా అధికారి ప్రవీణ్ కుమార్, నర్సంపేట ఫైర్ అధికారి అక్బర్ పెట్రోలు బంక్‌ను సందర్శించి పెట్రోలు షాంపిల్స్ సేకరించి పరీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెట్రోలులో ఎలాంటి కల్తీ జరుగలేదని, నిల్వలు సరిగానే ఉన్నాయన్నారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు సరిగా పాటించకపోవడంతో నోటీస్‌లు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ, రవికుమార్ పాల్గొన్నారు.



సంగెంలో ఎఫ్‌సీ పాస్ బుకింగ్ ప్రారంభం

సంగెం, మే 31: మండల కేంద్రంలోని ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎఫ్‌సీ పాస్ బుకింగ్‌ను బ్యాంకు మేనేజర్ సుల్తాన్ వెంకయ్య ప్రారంభించారు. దేశంలోనే మొట్టమొదటిగా ఇదివరకు ఎక్కడా లేని విధంగా మైక్రో ఏటీఎం ద్వారా వరంగల్ రీజియన్‌లోనే సంగెం బ్రాంచి ఈ బుకింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని బ్యాంక్ మేనేజర్ చెప్పారు. సంగెంలోని బ్యాంక్ మిత్ర నెల్లుట్ల సుహాసిని వద్ద పాస్ బుకింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. బ్యాంక్ ప్రతి ఖాతాదారుడు ఉచితంగా పాస్ బుక్ సేవలు పొందవచ్చన్నారు. వినియోగదారులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాక్ క్యాషియర్ జగదీష్, బ్యాంక్ ప్రతినిధి రాజు, చానల్ మేనేజర్ కక్కెర్ల అనిల్, ఖాతాదారులు వేల్పుల కుమారస్వామి పాల్గొన్నారు.

ప్రణాళికలతో గ్రామాభివృద్ధి చేసుకోవాలి



గంగదేవిపల్లిలో గ్రామాభివృద్ధిని వివరిస్తున్న రాజమౌళి

గీసుగొండ, మే 31: గ్రామాల అవసరాల నిమిత్తం పటిష్ఠ ప్రణాళికలను తయారు చేసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసుకోవాలని రాష్ట్రీయ్ గ్రామ్ స్వరాజ్‌యోజన కన్సల్టెంట్ రుచియాదవ్ అన్నారు. శుక్రవారం జాతీయ ఆదర్శ గ్రామలైన మరియపురం, గంగదేవిపల్లి గ్రామాలను డీఎల్‌పీవో వేదవతితో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ గ్రామపంచాయితీ ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్ వంటి మాధ్యమాల ద్వారా గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను షేర్ చేయాలన్నారు. మరియపురంలో చేపట్టిన నర్సరీ, పల్లెప్రకృతివనం, బోర్ రిచార్జ్‌పిట్స్, జీపీకి సంబంధించిన పలు రికార్డులను, వాటికి సంబంధించి ప్రొఫైల్‌ను ఆమె చూసి కార్యదర్శి నల్లెల స్వప్నను అభినందించారు. గంగదేవిపల్లిలో 20 సంవత్సరాలుగా గ్రామప్రజలు సమిష్ఠి కృషితో జాతీయస్థాయికి ఎదిగిన విదానాన్ని మాజీ సర్పంచ్ కూసం రాజమౌళి బృందానికి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణవేణి, తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీవో ప్రభాకర్, ఈటీసీ ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ విజయ్‌నాయక్, రవి, కార్యదర్శులు వేణుప్రసాద్, తపస్విని, స్వప్న,ప్రశాంత్, ఆపరేటర్‌లు సురేష్, శైలజ, ఆశ పాల్గొన్నారు.

పెట్రోలు బంక్‌లో విజిలెన్స్ అధికారుల తనిఖీ



పెట్రోలు బంకులో తనఖీ చేస్తున్న అధికారులు

ఖానాపురం, మే 31: మండల కేంద్రం శివారు లోని ఓంసాయి పెట్రోలు బంక్ లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, తూనికలు కొలతల అధికారులు శుక్రవారం తనఖీ చేశారు. మండల కేంద్రానికి చెందిన ఓ ద్విచక్రవాహనదారుడు పెట్రోలులో నీళ్లు వచ్చాయని అధికారులకు పిర్యాదు చేశారు. దీంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఇన్‌స్పెక్టర్లు రాకేష్, అనిల్‌కుమార్, లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి ప్రవీణ్‌కుమార్, నర్సంపేట ఫైర్ అధికారి అక్బర్ పెట్రోలు బంక్‌ను సందర్శించి పెట్రోలు శాంపిల్స్ సేకరించి పరీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెట్రోలులో ఎలాంటి కల్తీ జరుగలేదని, స్టాక్ రిజిస్టర్, నిల్వలు సరిగానే ఉన్నాయన్నారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు సరిగా పాటించకపోవడంతో నోటీ ఎలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెలూన్ షాపులో చోరీ

చెన్నారావుపేట, మే 31: మండలంలోని జల్లి గ్రామంలో ఓ సెలూన్ షాపులో చోరీ జరిగిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. బాధిత కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వల్లాజీ బాలాజీ తన సెలూన్ షాపులో రూ. 56 వేలను దాచి పెట్టాడు. రోజు వారి మాదిరిగానే గురువారం రాత్రి షాపుకు తాళం వేసి ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలను పగలగొట్టి షాపులో ఉన్న రూ .56 వేలను ఆపహరించారు. బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు.

ట్రాఫిక్ తంటాలు

• నర్సంపేటలో ప్రధాన సెంటర్లలో ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్ •ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పట్టణంలో ఇష్టారాజ్యంగా వెళ్తున్న వాహనాలు

నర్సంపేట టౌన్ మే 31 : జిల్లాలో వరంగల్ నగరం తర్వాత ప్రధాన పట్టణమైన నర్సంపేట శరవేగంగా విస్తరిస్తుండడం.. అదే స్థాయిలో వాహనాల సంఖ్య పెరిగిపోవడం, పట్టణానికి నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు పెరిగిపోతోంది. వరంగల్, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు అత్యంత సమీ పంలో ఉన్న నర్సంపేట పట్టణానికి మూడు జిల్లాలకు చెందిన ప్రజలు విద్య, వైద్యం, వ్యాపారం, రాజకీయం, తదితర అవసరాల కోసం వస్తుం టారు. దీంతో పట్టణంలో ప్రతీ రోజు వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది. ప్రధానంగా బస్టాండ్ సెంటర్, వరంగల్ రోడ్, నెక్కొండరోడ్, ద్వారకపేటరోడ్, అంగడిసెంటర్, అంబేద్కర్ సెంటర్, మాధన్నపేటరోడ్, మల్లంపల్లి రోడ్, పాఖాల్ రోడ్, పాపన్నగౌడ్ సెంటర్‌లలో ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సెంటర్లలో ఉదయం, సా యంత్రం వేళల్లో ప్రయాణం చేయాలంటే ప్రజలు నానా తంటాలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాన కూడళ్లల్లో సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడం, ట్రాఫిక్ పోలీసు సిబ్బందిని నియమించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. అటు మునిసిపల్, ఇటు పోలీసు అధికారుల సమన్వయలోపంతో ట్రాఫిక్ సమస్య నర్సంపేటలో నిత్యకృత్యమైంది.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

బస్టాండ్ సెంటర్, వరంగల్ క్రాస్‌రోడ్డు, అంబేద్కర్ సెంటర్, మాధన్నపేటరోడ్‌లలో ఆటోలు, ద్విచక్రవాహనాలను వాహనదారులు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తుండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ సెంటర్, అంగడిసెంటర్‌లలో చిరు వ్యాపారులు రోడ్డుపైనే వ్యాపారాలు చేస్తున్నా అరికట్టాల్సిన మునిసిపల్, పోలీసు అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వ్యాపార సముదాయాల వద్ద పార్కింగ్ స్థలాలు లేకపోవడాన్ని గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది.

కానరాని ట్రాఫిక్ సిబ్బంది

నర్సంపేట పట్టణంలో ట్రాఫిక్ నియంత్రించేందుకు గతంలో ప్రధాన సెంటర్లలో పోలీసు సిబ్బందికి ట్రాఫిక్ డ్యూటీలు వేసేవారు. ఉదయం, సాయంత్రం షిఫ్టలతో సిబ్బంది విధులు నిర్వర్తించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తేవి కావు. ప్రస్తుతం పట్టణ జనాభా 60వేలకు చేరుకోవడం, వేలాది వాహనాలు రాకపోకలు చేస్తున్న తరుణంలో పోలీసు అధికారులు ట్రాఫిక్ సిబ్బందిని నియమించకపోవడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పట్టణంలో పార్కింగ్ స్థలాల గుర్తింపు, పోలీసు సిబ్బంది నియామకం చేపట్టి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలి

వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య

వర్ధన్నపేట, మే 31: మార్కెట్‌లో నకిలీ విత్తనాల బెడద ఎక్కువగా ఉందని నాణ్యమైన విత్తనాలనే రైతులు కొనుగోలు చేసి అధిక దిగుబడులు పొందాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నకిలీ విత్తనాల బెడద ఎక్కువగా ఉండడం వల్ల రైతులు నష్టపోకుండా మంచి విత్తనాలను కొనుగోలు చేసి అధిక దిగుబడులు పొందాలని డివిజన్ పోలీసుల తరుపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రైతాంగం మార్కెట్‌లో విత్తనాలు కొనుగోలు చేస్తున్నపుడు ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలని ఎక్కడైనా తక్కువ ధరకు వస్తున్నాయని ఆశపడి నకిలీ విత్తనాలను తీసుకుంటే ఆ తరువాత భారీగా నష్టపోతారన్నారు. ఎవరైనా, ఎక్కడైనా నకిలీ విత్తనాలను చూసినా, మీ దృష్టికి వచ్చినా వెంటనే స్థానిక పోలీసుస్టేషన్, వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఏసీపీ సూచించారు.



నెక్కొండలోని ఓ ఎరువుల షాపులో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో పోలీసు, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, ఏవో సాగరిక, ఏఈవో సలావుద్దీన్, పోలీసులు బుచ్చిరాజు, బొజ్జు భరత్ తదితరులు పాల్గొన్నారు.

● నెక్కొండ: మండలంలోని వివిధ గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల విక్రయ షాపులను శుక్రవారం సీఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీచేశారు. రైతులకు విక్రయించే ఎరువులు, పురుగుమందులకు తప్పకుండా రైతులకు బిల్లు ఇవ్వాలని, ప్రతి షాపు ఎదుట ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని సూచించారు. విక్రయాలకు, స్టాక్‌కు సంబంధించి ప్రతి రోజు వివరాలను ఆన్ లైన్ చేయాలన్నారు. కల్తి విత్తనాలు అమ్మితే 8712685236 నెంబర్‌కు సమాచారం అందజేయాలన్నారు. ఈ దాడుల్లో ఎస్సై మహేందర్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

● చెన్నారావుపేట: మండలంలోని పలు గ్రామాల్లోని విత్తన విక్రయ కేంద్రాలను శుక్రవారం పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నెక్కొండ సర్కిల్ సీఐ చంద్రమోహన్, ఏవో శశికుమార్, ఎస్సై గూడ అరుణ్‌కుమార్, పోలీసుల సిబ్బంది, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాను నిషేధించాలి

ఖిలావరంగల్, మే 31: గోవుల అక్రమ రవాణా, గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ, భజరంగ్ దళ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శుక్రవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో సీఐ మల్లయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బొమ్మ నాగరాజు మాట్లాడుతూ ఇటీవల కాలంగా జిల్లాలో గోవుల అక్రమ రవాణా ఎక్కువైందని, గోవుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందని వాపోయారు. గోవులను వధించి, బహిరంగప్రదేశాలలో రోడ్ల పక్కన, జనసంచారం కలిగిన ప్రదేశాలలో గోవుల మాంసాన్ని విక్రయిస్తున్నారన్నారు. దీంతో హిందువు మనోభావాలు దెబ్బ తింటున్నాయన్నారు. ఇలాంటి చర్యలను ప్రభుత్వం కఠినంగా నిషేదించాలన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూపరిషత్ ఖిలా ప్రఖండ కార్యదర్శి తాళ్ళపల్లి రమేష్, గోరక్షా ప్రముఖ్ సంగినేని రాజేష్, ఖిలావరంగల్ భజరంగ దళ్ సంయోజక్ తుంగ సతీష్, పల్లె ప్రదీప్, ఎల్లం భరత్, విటల్‌రెడ్డి, చతుర్‌గంజి శ్రీకర్, కాలచర్ల వంశీకృష్ణ, పోశాల శ్రీను, ఇనుముల సతీష్, రావుల శేఖర్, బూర నాగరాజు, మేకల ప్రవీణ్ పాల్గొన్నారు.

విప్లవ ప్రజా ఉద్యమాలతో పేదల రాజ్యం



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న చిన్నచంద్రన్న

నర్సంపేట టౌన్, మే 31: బలమైన విప్లవ ప్రజా ఉద్యమాలతో పేదల రాజ్యం సాధ్యమవుతుందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాయం చిన్నచంద్రన్న, రాయల చంద్రశేఖర్, గడ్డం సదానందంలు అన్నారు. మండలంలోని మహేశ్వరంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు జిల్లా కార్యదర్శి చిర్ర సూరి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన 50 ఏళ్లుగా పేదల రాజ్య స్థాపన కోసం అనేక రకాల పోరాటాలు జరిగాయని, నేటికీ జరుగుతూనే ఉన్నాయని, గాంధీల రాజ్యం గడిచి, గాడ్సేల రాజ్యాలు వచ్చాయన్నారు. కానీ కమ్యూనిస్టు పార్టీలు ఎన్నికల్లో పాల్గొన్నప్పటికీ రాజ్యాధికారం సాధించేందుకు ఇంకా పేదల రాజ్యం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత పోరాట, ఉద్యమ అనుభవాలను సమీక్షించుకొని విప్లవ శక్తులు విడివిడిగా ఉంటే ప్రయోజనం లేదని, దేశ వ్యాప్తంగా ఉన్న విప్లకారులందరినీ ఐక్యం చేయాలనే సంకల్పంతో ఈ ఏడాది మార్చి మొదటివారంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) రెవల్యూషనరీ ఇనిషియేటివ్, పీసీసీ సీపీఐ(ఎంఎల్) మూడు విప్లవ పార్టీలు ఏకమై కార్మిక వర్గ పోరాటాలలో కలిసి జమిలీగా పోరాడితేనే పేదల రాజ్యం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మైదం పాణి, అర్షం అశోక్, ఎ. శ్రీనివాస్, స్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పనులు పూర్తి చేయండి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, మే 31: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనుల పురోగతిపై సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో మిగిలి ఉన్న పెయింటింగ్ పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన పనులను పరిశీలించి జూన్ 10వ తేదీలోగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు. స్కూల్ యూనిఫాం తయారీపై సమీక్షించి కుట్టుపని పూర్తయిన యూనిఫామ్‌లను ఆయా మండలాల ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు అందజేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్‌డీవో కౌసల్యదేవి, డీఈవో వాసంతి, స్పెషల్ ఆఫీసర్లు, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

శిఖం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



తహశీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సంఘం నాయకులు

చెన్నారావుపేట, మే 31: మండంలోని అక్కల్‌చెడ గ్రామ శివారులోని అక్కల్‌చెరువు శిఖం భూములు అక్రమించుకుంటున్న వారిపై చర్యలు తీసుకవాలని మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ ఫణికుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బొనగిరి స్వామి మాట్లాడుతూ ఇటీవల చెరువుకు సమీపంలో భూములు కొన్న కొందరు వ్యక్తులు చెరువు శిఖం భూములను అక్రమించుకుంటున్నారన్నారు. చెరువు హద్దులను తొలగించి మొరంతో చెరువును పూడ్చుతున్నారని తెలిపారు. చెరువు శిఖం భూములను చదు ను చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, మత్స్య కార్మికులకు న్యాయం చేయాల ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ముత్యం భద్రయ్య, దొని రాం చంద్రయ్య, ముత్యం రాజు, సదానందం, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాగరాజుపై విమర్శలు సరికాదు

వర్ధన్నపేట రూరల్, మే 31: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి బర్ల సహదేవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నారంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆయన అనుచరులు స్వేరోస్ ప్రతినిధులు ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. దళితులను మోసం చేసి బీఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంటుందన్నారు.

● వర్ధన్నపేట: స్వేరోస్ నాయకులు స్థాయికి తగిన విధంగా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని దిగజారి విమర్శిస్తే మూల్యం చెల్లించక తప్పదని కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట టౌన్ అధ్యక్షుడు మైస సురేష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై స్వేరోస్ యూనియన్ నాయకులు అనుచిత వ్యా ఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయ కులు ఐత ప్రవీణ్‌కుమార్, బెజ్జం పాపారావు, ఐత యాకాంతం, సిలువేరు శ్రీధర్‌యాదవ్, ఐత సుధాకర్, సోహెల్, కొండేటి సుధాకర్, రామగిరి వంశీ తదితరులు పాల్గొన్నారు.

● సంగెం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై స్వేరోస్ (సోషల్ వెల్ఫేర్ పూర్వ విద్యార్థులు) పిచ్చి కూతలు మానుకోవాలని వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ దళిత నాయకుడు మన్నె బాబురావు అన్నారు. ఇటీవల నాగరాజుపై అనుచిత వ్యాఖ్యాలు చేశారని ఆయన శుక్రవారం స్పందించారు. భవిష్యత్తులో ఇలాంటి అనుచిత వ్యాఖ్యాలు చేస్తే రుకునేది లేదని బాబురావు హెచ్చరించారు.

నల్లబెల్లి మద్దెల వాగు అక్రమణ..

నల్లబెల్లి, మే 31: నల్లబెల్లి శివారులోని మద్దెల వాగు భూమి అక్రమణకు గురవుతోంది. కొందరు వ్యక్తులు వాగులో ఉన్న బోరింగ్‌ను తొలగించారు. అనంతరం మద్దెల వాగులో డోజర్ వాహనంతో చదును చేసి మట్టి పోసి అక్రమణ చేశారు. విశాలంగా ఉండే మద్దెల వాగును వంతెన వైపు జరుపుతూ భూ అక్రమణకు పాల్పడుతున్నారు. దీంతో వాగు కుచించుకుపోయే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మద్దెల వాగు అక్రమణతో వానాకాలంలో నుంచి వచ్చే వరద తాకిడికి చుట్టూ ఉన్న పొలాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు కబ్జాదారులు యథేచ్ఛగా పట్టపగలే మద్దెల వాగు భూ ఆక్రమణకు పాల్పడడంతో గ్రామస్థులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. మద్దెల వాగు అక్రమణపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, సర్వే చేసి, వాగు భూమిని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నల్లబెల్లి మద్దెల వాగులో దోజర్‌తో చదును చేసి మట్టి పోసిన దృశ్యం

సర్వే కొనసాగుతోంది.

మద్దెల వాగు ఆక్రమణపై పరిశీలన, సర్వే కొనసాగుతోంది. త్వరలోనే మద్దెల వాగు హద్దులను గుర్తించి, పగడ్బందీగా హద్దులను ఏర్పాటు చేస్తాం. - తహసీల్దార్ బొనగాని రాజేష్

తోపనగడ్డతండాలో బాలిక అదృశ్యం

చెన్నారావుపేట, మే 31: మండలంలోని తోపనగడ్డతండాలో ఓ బాలిక అదృశ్యమైంది. ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన పానుగంటి రజిత(17) ఇంటి వద్దనే ఉంటూ తల్లిదండ్రులకు పనుల్లో సాయం చేసేది. ఈ నెల 28రాత్రి సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన రజిత తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా బాలిక ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక సోదరుడు నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సినీ నటుడు కృష్ణ జయంతి వేడుకలు

చెన్నారావుపేట, మే 31: ప్రముఖ సినీ నటుడు, దివంగత కృష్ణ జయంతి వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ చిత్ర పటం వద్ద ఆయన అభిమాని గొడిశాల స్వామి కెక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, మల్లయ్య, భూపాల్, నర్సయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

దీక్ష విరమణకు హనుమాన్ భక్తులు



ఖానాపురం రామాలయంలో ఇరుముడులు దరించి తరలివెళ్తున్న భక్తులు

నర్సంపేట టౌన్, మే 31 : నర్సంపేట మండలం భోజ్యానాయక్‌తండాలో శుక్రవారం హనుమాన్ మాలధారులు వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని 52 మంది హనుమాన్ మాలాధారులు ఇరుముళ్లతో కొండగట్టు అక్కడి నుంచి భద్రాచలానికి బయలుదేరారు. హనుమాన్ నామస్మరణతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో గురుస్వామి అజ్మీర భద్రినాయక్, బట్టు గోపి, భూక్య రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

● ఖానాపురం: హనుమాన్ దీక్షా చేపట్టిన దీక్షాదారులు (హనుమాన్ భక్తులు) ఇరుముడులతో శుక్రవారం భద్రాచలం, కొండగట్టు తదితర పుణ్యక్షేత్రాలకు తరలివెళ్లారు. మండలంలోని ఖానాపురం, అశోక్‌నగర్, మనుబోతులగడ్డ, కొత్తూరు, రాగంపేట, బుధరావుపేటతో పాటు పలు గ్రామాలకు చెందిన హనుమాన్ భక్తులు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ఇరుముడులు దరించి పుణ్య క్షేత్రాలకు తరలివెళ్లారు. మండల కేంద్రంలోని రామాలయంలో ఆలయ అర్చకుడు పర్వతపు శివప్రసాద్‌శాస్త్రీ మంత్రోచ్ఛరణలతో హనుమాన్ భక్తులు ఇరుముడులు దరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భద్రాచలం తరలివెళ్లారు. కార్యక్రమంలో భక్తులు వడ్డె రాజశేఖర్, హరీష్, చంద్రారెడ్డి, గుర్లపెల్లి శ్రీను, సాయి, కృష్ణ, ఒల్లెపు శ్రీను, ఒర్సు రవి, గణేష్, గోవింద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

● నెక్కొండ: ఆంజనేయస్వామి మాలాదారణ దరించిన మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తుల రోజున దీక్ష విరమణకు శుక్రవారం నెక్కొండ నుంచి బయలుదేరారు. స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో మాలాదారణ భక్తులు వారి కుటుంబ సభ్యులతో కలసి పూజలను నిర్వహించారు. అనంతరం గురుస్వాములు పెద్దకాసు కొమ్మాలు, ఆవురుపెల్లి కేధారిలు హనుమాన్ భక్తులకు ఇరుముడి కట్టారు. జూన్ 1న హనుమాన్ జయంతి సందర్భంగా కొండగట్టు, శ్రీశైలం, పొన్నూ రు, భద్రాచలంలో దీక్షవిరమణకు బయలుదేరామన్నారు.

హనుమాన్ జయంతికి ఆలయాల ముస్తాబు

గీసుగొండ: హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. కొనాయిమాకుల పంచముఖ ఆలయంలో హనుమాన్ భక్తుల ఇరుముడి, మాలవిరమణల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జూన్ 2వరకు మాలవిరమణ కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆనంద్‌సా సోదరులు తెలిపారు. ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులు కోసం అన్ని ఏర్పాట్లను చేసినట్లు చెప్పారు. ఆలయానికి పాదయాత్ర, హనుమాన్ శోభయాత్రల ద్వారా దాదాపు 50 వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని వారు చెప్పారు.